క్లుప్తంగా

దుర్గమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలి



కొఠారు అబ్బయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే

దెందులూరు: విశ్వ జనని కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని రైతులతో పాటు అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద పండుగల్లో దసరా ఒకటని ఆయన అన్నారు. అందరూ బాగుండాలి, అభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్కరికీ మేలు జరగాలని కనకదుర్గమ్మ తల్లిని కోరుకున్నానన్నారు. దెందులూరు నియోజకవర్గం ప్రజలతోపాటు ప్రతి ఒక్కరికీ ఆయన దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

అమృతకు ప్రశంసాపత్రం అందించిన జేసీ



ఏలూరులో విజేత సిరిశెట్టి అమృతకు సర్టిఫికెట్ అందిస్తున్న జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి

నిడమర్రు: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వక్తృత్వం పోటీల్లో ద్వితీయ స్థానం విజేతగా నిలిచిన పత్తేపురం జెడ్పీస్కూల్ 9వ తరగతి విద్యార్థిని సిరిశెట్టి అమృత లక్ష్మిసాయికి శుక్రవారం ఏలూరులో నిర్వహించిన బాలికా దినోత్సవం వేడుకల్లో జేసీ ధాత్రి రెడ్డి ప్రశంసాపత్రాన్ని అందించారు. గైడ్ టీచర్ సుబ్బరాజు, హెచ్ఎం సత్యనారాయణలు ఉన్నారు.

కైకరం హైస్కూలు విద్యార్థినికి సత్కారం



నెరుసు సుమలతను సత్కరిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి, అధికారులు

ఉంగుటూరు: బాలికలు దినోత్సవం సందర్భంగా ఏలూరు మహిళా ప్రాంగణంలో స్త్రీ శిశు సంక్షేమ, మహిళా అభివృద్ధి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కైకరం హైస్కూలు విద్యార్థిని నెరుసు సుమలతను జేసీ ధాత్రిరెడ్డి, ఎస్పీ ప్రతాప్‌కిషోర్ సత్కరించారు. సుమలత సిద్ధం చేసిన ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైందని హెచ్ఎం ప్రసాదరావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు కునాతి జాన్ తెలిపారు.

పెదవేగి ఎస్సైగా రామకృష్ణ

పెదవేగి : పెదవేగి నూతన ఎస్సైగా కె రామకృష్ణ పదవి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం పెదవేగి ఎస్సైగా ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఎం రాజేంద్రప్రసాద్ బదిలీపై కృష్ణా జిల్లా వెళ్లగా, రాజమండ్రి నుంచి బదిలీపై కె రామకృష్ణ పెదవేగి ఎస్సైగా బదిలీ అయ్యారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

- హిందూ ఆలయాల నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట
- అధిక నిధుల కేటాయింపుతో ఆలయాలకు పూర్వవైభవం
- అర్జావారిగూడెంలో రూ.10 లక్షలతో రామాలయం నిర్మాణం
- 13న వైభవంగా రామాలయ ప్రతిష్ఠ పూజలు



అర్జావారిగూడెంలో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నూతనంగా నిర్మించిన శ్రీరామాలయం

భీమడోలు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దళిత వాడల్లో ఆలయాల నిర్మాణాలకు పెద్ద పీట వేసింది. దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరి ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలను పునఃనిర్మించి పూర్వవైభవాన్ని తీసుకొచ్చింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనా కాలంలో హిందూ దేవాలయాల నిర్మాణానికి అధిక నిధులు కేటాయించి భక్తుల మనోభావాలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా దళిత వాడల్లో రామాలయాలు, వేంకటేశ్వర, అమ్మవార్ల ఆలయాల నిర్మాణాలకు రూ.కోట్లు వెచ్చించింది. సర్వాంగ సుందరంగా ఆలయాలను నిర్మించి దళిత వాడల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు పునఃప్రారంభమయ్యేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పండితులు చెబుతున్నారు.

అర్జావారిగూడెంలో సందడి

భీమడోలు గ్రామ పంచాయతీ శివారు అర్జావారిగూడెం గ్రామంలోని 400 దళిత కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇక్కడ ఐదు దశాబ్దాల క్రితం వరకు ఓ రేకుల షెడ్డులో ఉన్న రామాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. దసరా పండుగ నాడు ఇక్కడ గొంతెనమ్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. అప్పట్లో గ్రామ పెద్దలు ఆలయం ప్రాంగణం వద్ద గ్రామాల్లోని వివాదాలు, విభేదాలను పరిష్కరించేవారు. ఆధ్యాత్మిక చింతనతో గ్రామాలు ప్రశాంతంగా ఉండేవి. అయితే కాలక్రమేపీ ఆలయాల నిర్వహణ కరవై దూపదీప నైవేద్యాలకు ఆదాయం లేకపోవడం, రామాలయం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో పాటు కనీస వసతులు సమకూర్చకపోవడంతో శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికి ఆలయ ప్రాంగణంలోకి నీరు చేరేది. నాయకులు ఎన్నికల వేళ వచ్చి ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆలయ పునఃనిర్మాణానికి ఏర్పాట్లు చురుగ్గా కొనసాగాయి.



శిథిలావస్థకు చేరిన రామాలయంలోకి వర్షం నీరు చేరిన దృశ్యం (ఫైల్)



రామాలయంలోని శ్రీసీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్లు

గత ప్రభుత్వంలోనే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షల మంజూరు

గ్రామంలోని శిథిలావస్థకు చేరిన రామాలయాన్ని పునఃనిర్మించాలని అప్పటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, గ్రామపెద్దలు కలిసి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు కేటాయించాలని కోరారు. స్పందించిన వాసుబాబు నిధులు మంజూరుకు ప్రత్యేక శ్రద్ధ వహించారు. 2022 సెప్టెంబర్ 22న వాసుబాబు ఆలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షలు మంజూరు కాగా సమరసతా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ పనులు చేపట్టారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుల బృందం పనులపై పర్యవేక్షణ చేస్తూ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఈ నెల 13న సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టనున్నారు. దీనితో గ్రామంలో ఆలయాన్ని నిర్మించడంతో ఆ ప్రాంతవాసులంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

రామాలయ నిర్మాణం హర్షణీయం



మా గ్రామంలో శాశ్వత రామాలయం నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా ఉన్న కల నెరవేరబోతోంది. దశాబ్దాలుగా శిథిలావస్థకు చేరిన రామాలయాన్ని పునఃనిర్మించడం హర్షణీయం. జగనమోహన్‌రెడ్డి ప్రభుత్వంలో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా జిల్లాలో 450 దేవాలయాల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. జగనన్న ప్రభుత్వంలో రూ.5 లక్షల నుంచి రూ.10లక్షల వరకూ ఆలయాల నిర్మాణానికి నిధుల కేటాయింపు పెంచారు. గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో రామాలయాన్ని గ్రామస్తులు ఐక్యతతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

– పాము మాన్‌సింగ్, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు, అర్జావారిగూడెం

నాగూర్ సాహెబ్ సేవలు ప్రశంసనీయం



నాగూర్‌సాహెబ్‌ను సత్కరిస్తున్న ముస్లింలు

ఉంగుటూరు: నారాయణపురం హైస్కూలు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన షేక్ నాగూర్ మీరాసాహెబ్ సేవలు ప్రశంసనీయమని పలువురు ముస్లిం నేతలు అన్నారు. శుక్రవారం చేబ్రోలు మజీద్‌లో ముస్లిం సంఘ సభ్యులు మీరాసాహెబ్‌ను సత్కరించారు. మజీద్ ముతవల్లి, ఇమామ్, మౌజిన్, బాబావాల్లీ, ఖరీముల్లా మాట్లాడారు. జమాద్ సభ్యులు అందరికీ సన్మాన గ్రహీత హెచ్ఎం మీరాసాహెబ్ కృతజ్ఞతలు తెలిపారు.

వంట నూనెల విక్రయ కేంద్రం ప్రారంభం

దెందులూరు: స్థానిక కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం వద్ద శ్రీ బాలాజీ ట్రేడర్స్ అధినేత సుగ్గిశెట్టి హనుమాన్ ఆధ్వర్యంలో చౌక ధరలకు వంట నూనెలు సరఫరా చేసే కేంద్రాన్ని ప్రారంభించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లబ్ధిదారులకు వంట నూనె ప్యాకెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), మండల పార్టీ నాయకులు గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచ్ తోట ఏసమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు కుంకుమ పూజలు



మహిషాసురమర్దని అలంకరణలో శ్రీరామవరంలోని అమ్మవారు



పూళ్ల, ఎంఎంపురం గ్రామాల ఇలవేల్పు భవానీ మాతకు కాళికా దేవిగా అలంకరణ



గుండుగొలనులో కాళికాదేవి అలంకారంలో భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి



భీమడోలులో ఈతకోట వారి వీధిలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

భీమడోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శుక్రవారం అమ్మవారు కాళికాదేవి, మహిషాసురమర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని చలువ పందిళ్లల్లో కొలువైన అమ్మవార్లకు, ఆలయాల్లోని అమ్మవార్లను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని విశేష పూజలు చేశారు. గుండుగొలను, కురెళ్లగూడెం, పూళ్ల, ఎంఎంపురం, భీమడోలు, నరెడ్లగూడెంలో ప్రత్యేక పూజలు చేశారు. గుండుగొలనులో భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు, పూళ్ల, ఎంఎంపురం ఇలవేల్పు భవానీ మాత కాళికాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కురెళ్లగూడెంలో అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ.10 లక్షల కరెన్సీతో అలంకరించారు. భీమడోలు గోదావరి కాలువ గట్టుపై వేంచేసియున్న అమ్మవారు మహిషాసురమర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భీమడోలులోని గణపతి సెంటర్ యూత్ ఆధ్వర్యంలో ఈతకోట వారి వీధిలోని దుర్గమ్మ మండపం వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. గుండుగొలనులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో,సింగవరం ఆలయం వద్ద దసరా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.

దెందులూరు: దసరా ఉత్సవంలో భాగంగా శుక్రవారం గోపన్నపాలెం కనకదుర్గమ్మ మహిషాసురమర్దని అలంకరణలో దర్శనమిచ్చారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

కనకదుర్గమ్మకు పూజలు

గణపవరం: దుర్గాష్టమి సందర్భంగా కనకదుర్గ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం గణపవరంలోని కంచికామాక్షి, కనకదుర్గ అమ్మవార్లను దుర్గాదేవి అలంకరణచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిప్పర, సరిపల్లె, చినరామచంద్రపురంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మొయ్యేరు, అర్ధవరం, కొమ్మరలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి.

దెందులూరు ఎస్సై బాధ్యతల స్వీకరణ



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సైను కలిసిన నాయకులు

దెందులూరు: జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, మండల ప్రజలందరి సహాయ సహకారంతో దెందులూరు మండలాన్ని ఉత్తమ మండలంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని దెందులూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆర్ శివాజీ అన్నారు. శుక్రవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో రాజమండ్రి నుంచి బదిలీపై వచ్చిన ఆర్ శివాజీ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్, మత్తు పదార్థాలు, నేరాల నివారణతో పాటు శాంతిభద్రతలకు తొలి ప్రాధాన్యతనిస్తామన్నారు. మండలంలో ఎవరికైనా ఏ సమస్య వచ్చినా నేరుగా తన సెల్ ఫోన్ నంబర్ 9440796654 కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. తొలుత నాయకులు బాదంపూడి రమేష్ బాబు, సంపంగి వేణుగోపాల్ తిలక్, మేదూరి వెంకటేశ్వరరావు, కసుకుర్తి రామకృష్ణ, గోరింకల ఏసోబు, ఏలూరు ఎన్‌జీవోలు, ఇతర ఉద్యోగులు, స్టేషన్ సిబ్బంది ఎస్సై శివాజీకి బొకేలు, శాలువాలతో సత్కరించి స్వాగతం పలికారు.

ఆదర్శ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి

భీమడోలు: బాలికలపై హింస సమాజ హేతువు అని, వాటిని నివారించి ఆదర్శ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. ప్రపంచ బాలికా దినోత్సవంను పురస్కరించుకుని శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కి షోర్ బాలికలు, లబ్ధిదారులకు బాలికల సంరక్షణ, బాలికల హక్కులు, బాలికల విద్య, బాల్య వివాహాలు గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు ర్యాలీ ప్రదర్శన చేసి మానవహారం చేసారు. బేటీ బచావో, బేటీ పడావో అంటూ నినదించారు. ఆడపిల్లలను రక్షించాలి.. బాల్య వివాహాలను నియంత్రించాలని నినాదాలు చేసారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి సూపర్‌వైజర్ ఎండీ షహనాజ్‌బేగం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. సూపర్‌వైజర్లు ఎస్‌కే నూర్జహాన్, ఎం.కవిత, వివిధ శాఖల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చేబ్రోలులో అంగన్‌వాడీ సెంటరులో..

ఉంగుటూరు: బేటి బచావో -బేటీ పడావో కార్యక్రమం ఉంగుటూరు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. శుక్రవారం బాదంపూడి చేబ్రోలు, కైకరంలో నిర్వహించారు. ఈ సందర్భంలో బాలికలను పరిరక్షించాలనే నినాదాలు చేశారు. గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు ర్యాలీ నిర్వహించారు. బాదంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి కంకట పద్మలీల, ఈవోపీఆర్డీలు, హెల్త్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కైకరంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, ఎంపీడీవో ఆఫీసు సూపరింటిండెంటు ఆంజనేయులు పాల్గొన్నారు.

భవానీ మాలధారులకు అల్పాహారం పంపిణీ

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు వద్ద కొప్పుల వెలమ సంఘం ఆధ్వర్యంలో భవానీ మాలధారులకు అల్పాహారం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం సంఘం జిల్లా నాయకులు సంపంగి వేణుగోపాల్ మాట్లాడుతూ దసరా సందర్భంగా కాలినడకన విజయవాడ తదితర అమ్మవారి ఆలయాలకు వెళ్లే భవానీ మాలధారులకు అల్పాహారం అందించడం హర్షణీయమన్నారు. దెందులూరు గ్రామానికి చెందిన కొప్పుల వెలమ సంఘం నాయకులు సంపంగి వేణుగోపాల తిలక్, మెరప చిన్నా, రాజేష్, గోపి, వెంకటేశ్వరరావు తదితరులు ఆధ్వర్యంలో అల్పాహారం, తాగునీరు, మజ్జిగప్యాకెట్లు, భోజనం, పులిహోర, ఇడ్లీతోపాటు పలు రకాల అల్పాహారాన్ని మాలధారులకు అందించారు.

ముగిసిన మద్యం దుకాణాల దరఖాస్తుల ప్రక్రియ

- నియోజకవర్గంలో 21 దుకాణాలకు 1,035 దరఖాస్తులు
- ఎక్కువగా భీమడోలు, తక్కువగా ఉంగుటూరులో పోటీ
- 14న లాటరీలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్న ఆశావహులు



మద్యం దుకాణం (ఫైల్)

నియోజకవర్గంలో ఇలా..

మండలం	దుకాణాల సంఖ్య	అందిన దరఖాస్తులు
గణపవరం	04	221
నిడమర్రు	03	148
భీమడోలు	06	383
ఉంగుటూరు	07	283
మొత్తం	21	1,035

నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గంలో మద్యం దుకాణాల లైసెన్స్‌లకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇందుకు సంబంధించిన దరఖాస్తుల గడువు శుక్రవారం రాత్రి 7 గంటలకు ముగిసింది. ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో అన్ రిజర్వుడు కోటాలో ఉన్న 21 దుకాణాలకు 1,035 దరఖాస్తులు అందినట్లు భీమడోలు ఎక్సైజ్ సర్కిల్ సీఐ సత్యనారాయణ తెలిపారు.ఇప్పటికే ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఈ కొత్త పాలసీ సెప్టెంబరు 30న 2026 వరకు అమల్లో ఉంటుంది. ఉంగుటూరు నియోజకవర్గంలో మొత్తం 25 దుకాణాలకు 21 దుకాణాలు అన్ రిజర్వుడు కోటాలో ఉండగా, మండలానికి ఒకటి చొప్పున మొత్తం 4 దుకాణాలు గౌడ కులస్తులకు రిజర్వుడులో ఉంచారు. ప్రస్తుతం ఈ రిజర్వుడు దుకాణాలకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించలేదు.

భీమడోలు మండలంలో ఎక్కువగా పోటీ

మద్యం దుకాణాలకు సంబంధించిన దరఖాస్తుల్లో భీమడోలు మండలంలో ఒక్కో దుకాణానికి అత్యధికంగా 64 మంది ఆశావాహులు పోటీలో ఉండగా తక్కువగా ఉంగుటూరు మండలంలో ఒక్కో మద్యం దుకాణానికి 40 మంది పోటీలో ఉన్నారు. గణపవరం మండలంలో ఒక్కో దుకాణానికి 56 మంది, నిడమర్రు మండలంలో ఒక్కోషాపుకి 49 మంది అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఒక్కో దరఖాస్తుదారుడి నుంచి రూ.2 లక్షలు నాన్ రిఫండ్‌బుల్ రుసుము చెల్లించారు. 12, 13 తేదీల్లో దరఖాస్తుల పరిశీలన ఉంటుంది.

కలెక్టర్ పర్యవేక్షణలో లాటరీ

ఈ నెల 14న జిల్లా కేంద్రం ఏలూరులో కలెక్టర్ పర్యవేక్షణలో లాటరీ తీసి లైసెన్సులు ఖరారు చేస్తారు. అక్టోబరు 16 తేదీ నుంచి కొత్త లైసెన్సుదారుల మద్యం దుకాణాలను ప్రారంభించుకోవచ్చు. జిల్లా ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి ఈ లాటరీ వద్ద ఉంటారు. మీడియా ప్రతినిధులకు అనుమతి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కేటాయించిన వైన్ షాపుల సీరియల్ నంబర్ ఆధారంగా డ్రా తీస్తారు. లాటరీ బాక్స్‌లలో షాపుల నంబర్లు, వాటికి కోడ్ చేసిన వారి వివరాలు ఉంటాయి. షాప్ దక్కించుకున్న వారి వివరాలు అధికారులు ప్రకటిస్తారు.

నిడమర్రులో లైసెన్స్ ఫీజు రూ.55 లక్షలు

నిడమర్రు మండలంలో దుకాణానికి లైసెన్స్ ఫీజు మొదటి ఏడాది రూ.55 లక్షలు, రెండవ ఏడాది 10 శాతం లైసెన్స్ ఫీజు పెంచి రూ.60.50 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాలి. గణపవరం, భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో దుకాణాలు పెట్టుకునే వారు మొదటి ఏడాది రూ.65 లక్షలు, 10శాతం పెంచి రెండో ఏడాది రూ.71.50 లక్షలు లైసెన్స్ ఫీజ చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్స్ పొందిన వారు ఆరు విడతల్లో లైసెన్స్ రుసుము చెల్లించవచ్చు. మద్యం రిటైల్ వ్యాపారం చేసే లైసెన్స్‌దారులు 20 శాతం మేర మార్జిన్ ఇస్తారు. గతంలో 10 శాతం మార్జిన్ ఇచ్చేవారు. అన్ని బ్రాండ్లు ఉండాలే పారదర్శక మద్యం పాలసీ అందిస్తున్నామని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

ఎంఎస్ఎంఈ పథకంలో అర్హులకు రుణాలు

దెందులూరు: మండలంలో ప్రభుత్వ లక్ష్యాల అనుగుణంగా మహిళా సంఘాల నిర్వహణ, ఆర్థికాభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలుకు ఎంఎస్ఎంఈ పథకం ద్వారా ప్రణాళిక రూపొందించామని దెందులూరు మండల ఏపీఎం సురేష్ అన్నా రు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సురేష్ మాట్లాడుతూ మహిళా సంఘాల గ్రూపు సభ్యులు యూనిట్ ఏర్పాటు చేసుకుంటే వాటి అభివృద్ధికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. ఈ పథకాన్ని డ్వాక్రా సంఘాలు ఉపయోగించుకోవాలన్నారు.